బిజెపి విధానాలు.. దేశ సమగ్రతకు ముప్పు

- కేంద్ర ప్రభుత్వ అప్రజాస్వామిక విధానాలను ఎండగట్టాలి
- పార్లమెంట్‌లో వ్యూహాత్మకంగా వ్యవహరించాలి
- కలిసొచ్చే పార్టీలను కలుపుకొని కేంద్రాన్ని నిలదీయండి
- బిఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో సిఎం కెసిఆర్

బిఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో సిఎం కెసిఆర్, తదితరులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు దేశ సమగ్రతకు, అభివృద్ధికి ఆటంకాలుగా మారినాయని బిఆర్ఎస్ అధ్యక్షులు, సిఎం కెసిఆర్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న దురదృష్టకర విధానాలతో దేశంలో పరిస్థితులు రోజు రోజుకు దిగజారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను, పార్లమెంటరీ బడ్జెట్ సమావేశాల్లో ఎండగట్టాలని బిఆర్ఎస్ పార్టీ ఎంపిలకు కెసిఆర్ దిశా నిర్దేశం చేశారు. పార్లమెంటు జరిగినన్ని రోజులు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ, రాష్ట్రంతో పాటు దేశంలోని ప్రజా సమస్యలపై గొంతుని వినిపిస్తూ కేంద్రం చేస్తున్న తప్పులను దేశ ప్రజల దృష్టికి తీసుకురావాలని సిఎం అన్నారు. పార్లమెంటరీ ప్రజాస్వామిక పంథాలో వీలయినన్ని అన్ని మార్గాలను అనుసరించి కేంద్ర ప్రభుత్వం అప్రజాస్వామిక విధానాలను ఎండగట్టాలని స్పష్టం చేశారు. ఈ దిశగా బిఆర్ఎస్‌తో కలిసివచ్చే పార్టీలను కలుపుకుని కేంద్రాన్ని ఉభయ సభల్లో నిలదీయాలని తెలిపారు. ప్రగతి భవన్‌లో ఆదివారం కెసిఆర్ అధ్యక్షతన బిఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ సమావేశం జరిగింది. దాదాపు నాలుగు గంటలకు పైగా సాగిన సమావేశం అనేక అంశాలను చర్చించింది. కేంద్రం అనుసరిస్తున్న నిర్లక్ష్యపూరిత, ప్రమాదకర విధానాల వల్ల దేశ భవిష్యత్తుకు తీరని నష్టం వాటిల్లుతోందని సమావేశం ఆవేదన వ్యక్తం చేసింది.

'కార్పొరేట్ ' డొల్లతనం బైటపడుతున్నా సంపదను ప్రయివేట్‌పరం చేస్తారా...

ఈ సందర్భంగా సిఎం కెసిఆర్ మాట్లాడుతూ దేశ ప్రజలు తమ కష్టార్జితంతో కూడబెట్టుకుంటున్న సంపదనంతా ప్రధాని మోడీ అప్పనంగా తమ కార్పోరేట్ స్నేహితులకు కట్టబెడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. 'తమకు అనుకూల కార్పోరేట్ శక్తుల పట్ల కేంద్ర ప్రభుత్వం ప్రేమ కురిపిస్తూ లక్షలాది కోట్ల రూపాయల రుణాలను కేంద్రం రద్దు చేస్తోందని ఆరోపించారు. ఎల్ఐసి వంటి ప్రభుత్వ రంగ సంస్థల్లో అదానీ వంటి బడా వ్యాపారవేత్తలకు వాటాలను అప్పనంగా కట్టబెడుతోందన్నారు. వారి కంపెనీల డొల్లతనం బైటపడుతూ వారి షేర్ల విలువ హఠాత్తుగా పడిపోతూ లక్షల కోట్ల రూపాయలు ఒక్క రోజులోనే నష్టపోతున్న వాస్తవాన్ని దేశం గమనిస్తోందన్నారు. వారి లాభాలు సంపదంతా నీటిబుడగలేనని స్పష్టమైందని తెలిపారు. ఇటువంటి ఆర్థిక అవకతవకలకు దోహదం చేసే విధంగా దేశ సంపదనంతా ప్రయివేట్ పరం చేస్తూ కేంద్రం తీరని నష్ట చేస్తోందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రమాదకర ఆర్థిక విధానాల మీద పార్లమెంటు ఉభయ సభల్లో గొంతెత్తాలని పిలుపునిచ్చారు. దేశ ప్రజల ప్రయోజనాలకు తూట్లు పొడుస్తున్న బిజెపి కేంద్ర ప్రభుత్వ వైఖరిని బిఆర్ఎస్ ఎంపీలు తీవ్రంగా ఖండించాలని కోరారు.

ఫెడరల్ స్ఫూర్తిపై నినదించండి

"కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఫెడరల్ స్ఫూర్తికి తూట్లు పొడుస్తూ రాష్ట్రాలను అనేక రకాలుగా ఇబ్బందులకు గురిచేస్తోంది. దీనిపైనా పార్లమెంటులో నిలదీయాలి. ప్రగతి పథంలో నడుస్తున్న తెలంగాణ వంటి రాష్ట్రానికి ఆర్థికంగా అనేక రకాలుగా ఆటంకాలు సృష్టిస్తూ ప్రగతిని అడ్డుకుంటున్న కారణమేందో జాతికి చెప్పాలని కేంద్రాన్ని నిలదీయాల్సి వుంది. అక్కడితో ఆగకుండా గవర్నర్ల వ్యవస్థనూ కేంద్ర ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోంది. రాష్ట్రాలను నిర్వీర్యపరిచే దిశగా గవర్నర్లను కేంద్రం తమ చెప్పుచేతుల్లో పెట్టుకోవడం అప్రజాస్వామికం. రాజ్యాంగబద్ధమైన విధులను నిర్వర్తిస్తూ కేంద్ర రాష్ట్రాల నడుమ సంధాన కర్తలుగా వుండాల్సిన గవర్నర్ల వ్యవస్థను తమ రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకుంటున్న దుర్మార్గ విధానాలను బిఆర్ఎస్ ఎంపిలుగా మీరు ఉభయ సభల్లో తీవ్రంగా వ్యతిరేకించాలి. రాష్ట్ర కేబినెట్ సహా, అత్యున్నత సభలైన శాసన సభ, శాసన మండలి తీసుకున్న నిర్ణయాలను సైతం ఉద్దేశపూర్వకంగా పెండింగులో పెడుతూ గవర్నర్లు బేఖాతరు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వాల పనితీరును ప్రభావితం చేయాలని, అభివృద్ధిని పాలనను అడ్డుకోవాలని చూస్తున్న గవర్నర్ల అప్రజాస్వామిక విధానాలను, కేంద్రం వైఖరిని మీరు పార్లమెంటు సాక్షిగా ఎండగట్టాలి. పెట్రోల్ డీజిల్ సహా వంటగ్యాస్ తదితర నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. సామాన్యుడి బతుకు పెరుగుతున్న ధరలతో రోజు రోజుకూ భారమైపోతున్నా కేంద్రానికి ఏమాత్రం పట్టింపులేదు. దేశవ్యాప్తంగా సామాన్య ప్రజలు అనుభవిస్తున్న బాధలను కష్టాలను పార్లమెంటు ఉభయ సభల ద్వారా దేశ ప్రజల దృష్టికి తీసుకపోవాలె. " అని తెలిపారు. రోజు రోజుకూ దేశంలో నిరుద్యోగం పెరుగుతోందని, దేశ యువతను ఏమాత్రం పట్టించుకోకుండా, వారికి ఉద్యోగ భద్రత కల్పించకుండా, ప్రభుత్వ సంస్థలను ప్రయివేటీకరిస్తూ తీరని నష్టం చేస్తోందని, ఈ అంశం పై గట్టిగా గొంతు వినిపించాలని ఎంపిలకు స్పష్టం చేశారు. తెలంగాణకు రావాల్సిన విభజన హామీల పై కేంద్రం ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తోందని, ఇందుకు సంబంధించి గొంతెత్తాలన్నారు. తెలంగాణకు రావాల్సిన అనేక హక్కులను రాబట్టే దిశగా పార్లమెంటులో గొంతు వినిపించాలని స్పష్టం చేశారు. కుల మత వర్గాలకు అతీతంగా సర్వజనుల హితమే తన మతమని చాటిన మహాత్మాగాంధీ ఆదర్శాలు భారతదేశానికి తక్షణావసరమని అన్నారు. జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి (అమరవీరుల దినోత్సవం) సందర్భంగా కెసిఆర్ ఆయనను స్మరించుకున్నారు. జాతి సమగ్రతను, ఐక్యతను నిలబెట్టేందుకు తన జీవితాన్ని అర్పించిన మహాత్మగాంధీ ఈ దేశ పురోగమనానికి సదా ఓ దిక్సూచీలా నిలుస్తారని పేర్కొన్నారు. నమ్మిన లక్ష్యాన్ని చేరుకునే క్రమంలో ఎదురయ్యే ఆటంకాలను లెక్క చేయకుండా ఒక్కొక్కటిగా అధిగమిస్తూ విజయతీరాలకు చేరాలనే స్ఫూర్తిని, గాంధీ జీవితం నుంచి ప్రతి ఒక్కరూ నేర్చుకోవాల్సి ఉందన్నారు. గాంధీజీ ఆశయాల వెలుగులో ముందుకు సాగుతామన్నారు.

ఈ సమావేశంలో పార్లమెంటరీ పార్టీ నేతలు కె కేశవరావు (రాజ్యసభ), నామా నాగేశ్వర్ రావు (లోక్ సభ), ఎంపిలు జోగినపల్లి సంతోష్ కుమార్, కె ఆర్. సురేష్ రెడ్డి, బడుగుల లింగయ్య యాదవ్, వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారథి, దీవకొండ దామోదర్ రావు, కొత్త ప్రభాకర్ రెడ్డి, బీబీ పాటిల్, మన్నె శ్రీనివాస్ రెడ్డి, మాలోత్ కవితా నాయక్, పసునూరి దయాకర్, బొర్లకుంట వెంకటేశ్, పోతుగంటి రాములు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE IV JUNIOR CIVIL JUDGE, RANGA REDDY DISTRICT AT : L.B.NAGAR .
OS.No. 1273 of 2022
Between:
Dubba Lavanya Mouli and others ....PLAINTIFFS
AND
The Tahsildar Balapur Mandal and another ....DEFENDANTS
To,
1.All Concerned ... Defendant

It is hereby informed you that the plaintiff's filed the above suit for declare them as the legal heirs ofLate Dubba Chandra Mouli S/o D.Kondanna and also to declare them as owners of below mentioned schedule property and the same is posted on 15-02-2023.
\\ By the order of the court//

SCHEDULE OF PROPERTY

All that Piece and Parcel of open land bearing Plot no.130 South Part, admeasuring 100 Sq.yards in Survey No.184/1, Situated at Maruthi Nagar Jalpally Village, Balapuar Mandal, Ranga Reddy District, and Bounded by:-
NORTH : Plot No.130 North Part.
SOUTH : Plot No.131.
EAST : 25 ft. wide road.
WEST : Plot No.109.

D.NagaPhanindarasharma
Advocate M.A L.L.B(Honos)
H.No.3-131, Flat No.301,
SLNS Nivas,MeesevaStreet,
Vikasnagar,Dilsukhnagar,
RangareddyDistrict.T.S-60
Cell : 8686460360

IN THE COURT OF THE HON'BLE XVII ADDL. SENIOR CIVIL JUDGE, CCC AT :: HYDERABAD
I.A.No. 623 of 2017
IN
O.S.No. 709 of 2017
Between:-
Sri Chauhan Motilal, S/o. Late.Chauhan Laxman, Aged about 85 years, Occ: Business, R/o H.No.5-8-45(Laksh), Fateh Sultan Lane, Nampally, Hyderabad. ....Petitioner/Plaintiff
AND
Smt. Revuri Radha Bai (Died) Per Lr's and others ....Responsents/ Defendants
3) R.Balraj, S/o.Late R.Krishna Murthy, Aged about 51 years, Occ: Business, R/o.H.No.13-1-1146/A/69/A, Laxminagar, Asif Nagar, Hyderabad.
4) R.Prabhu, S/o.Late R.Krishna Murthy, Aged about 50 years, Occ: Business,R/o.H.No.13-1-169/1, Mustadipura, Jehhra, Hyderabad.
5) R.Satish, S/o.Late R.Krishna Murthy, Aged about 46 years, Occ: Business, R/o. H.No.18-14/A, Lingampally, Hyderabad.
6) R.Mallikarjun, S/o.Late R.Krishna Murthy, Aged about 42 years, Occ: Business, R/o.H.No.13-2-267/A/35, Raheempura, Hyderabad.
....Respondents/Defendants.no.3 to 6

Please take notice that the above named Plaintiff filed a Suit for Eviction before the Hon'ble XVII Additional Senior Civil Judge at Hyderabad, to evict the Respondents from the Suit Schedule Premises and to direct the Respondents to pay the arrears of rents and mesne profits. The said case is posted to **02-02-2023** for **Respondents.no.3 to 6 appearance,** and the Respondents.no.3 to 6 are hereby directed to appear before the above said Hon'ble Court in person/s or through your advocate/s on **02-02-2023** at **10-30 A.M**, failing which, the said Hon'ble Court will decide the said suit.

(BY ORDER OF THE COURT)
(K.L.B. KUMAR)
Advocate
Flat No. G-2, H.No.11-5-8, Happy Home Castle Apart., Red Hills, Nampally, Hyderabad – 500004.Ph: 9866301129
Counsel for the Petitioner/Plaintiff

రజక వృత్తిదారుల సంక్షేమం పట్ల సర్కారు నిర్లక్ష్యం

- రౌండ్ టేబుల్ సమావేశంలో పైళ్ల ఆశయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'రజక వృత్తిదారుల సంక్షేమంపట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. రజక జనాభాలో 80 శాతానికి పైగా ఈ వృత్తిపైన్నే ఆధారపడి బతుకుతున్నారు.సమాజంలో సేవా వృత్తిగా పిలవబడుతున్న రజకుల పట్ల సర్కారు చిన్నచూపు చూడటం సరికాద'ని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య విమర్శించారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గుమ్మడిరాజు నరేశ్ అధ్యక్షతన '2023-24 రాష్ట్ర బడ్జెట్‌లో రజక వృత్తిదారుల సంక్షేమానికి వెయ్యి కోట్లు కేటాయించాలి' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశయ్య మాట్లాడుతూ ప్రతి ఏటా బడ్జెట్‌లో రజకులకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాగితాల్లో చూపిస్తున్న అరకొర నిధుల్ని కూడా ఖర్చు చేయడంలేదని చెప్పారు. 2017-2020 బడ్జెట్లలో రూ.450 కోట్లు కేటాయించినట్టు ప్రకటించి, వాటిని విడుదల చేయలేదని తెలిపారు. దోబీఘాట్ల నిర్మాణం కోసం మూడు కోట్లు మాత్రమే కేటాయించి ప్రభుత్వం చేతులు దులుపుకుందని తెలిపారు. ఎనిమిదేళ్లలో తొమ్మిది దోబీఘాట్లు మాత్రమే కట్టడమేంటని ప్రశ్నించారు. 46 దోబీఘాట్ల నిర్మాణానికి దరఖాస్తులు వస్తే.. వాటినెందుకు పట్టించుకోవటం లేదో చెప్పాలన్నారు. తరతరాలుగా వృత్తిపై ఆధారపడి బతుకుతున్న రజకులు..కాంట్రాక్టర్లదగ్గర కూలీలుగా బతకాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్పత్రులు,విద్యా సంస్థలు, పోలీసు శాఖల బట్టల వాషింగ్, ఇస్త్రీ పనుల్ని వృత్తిదారులకే ఇవ్వాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. వృత్తి పరంగా ఎలాంటి ఆర్థిక పరమైన మెరుగుదల లేకపోవడంతో వెనుకబాటు, అణచివేత, దోపిడీ, వివక్షతలకు గురౌతున్నారని చెప్పారు. రజక వృత్తిలోకి అనేక కార్పొరేట్ కంపెనీలు ప్రవేశించటంతో అసలైన వృత్తిదారులు దివాళా తీస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అర్హత కలిగిన వారందరికీ రుణాలిస్తామని నమ్మబలికిన ప్రభుత్వం.. 50వేల దరఖాస్తులను బుట్టదాఖలు చేసిందని విమర్శించారు. ఉమ్మడి రాష్ట్రంలో రజకుల సంక్షేమానికి ఏర్పాటు చేసిన 18, 19, 343, 116, 178, 11, 892, 27 జిఒలను రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు అమలు చేయటం లేదో చెప్పాలని ప్రశ్నించారు. ఉచిత విద్యుత్ పథకాన్ని ఎల్‌టి-4కు మార్చి, ఎసిడి ఛార్జీల భారాలు తగ్గించాలని డిమాండ్ చేశారు. రజకుల సామాజిక భద్రతకోసం రక్షణ చట్టం చేయాలన్నారు.

ఫెడరేషన్‌కు పాలక వర్గాన్ని నియమించాలని, దోబీ ఘాట్‌ల పరిరక్షణకు ప్రహరీ గోడలు నిర్మించాలని, కబ్జాల నుంచి కాపాడాలనీ, వత్తిదారులందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలివ్వాలనీ,రూ.5లక్షల జీవితాబీమా సౌకర్యం ఏర్పాటు చేయాలని పలు తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం బాలకృష్ణ, సహాయ కార్యదర్శులు సి మల్లేశ్, ఎదునూరు మధార్,పి రాములు, నవీన్, దోబీ మహాసంఘం రాష్ట్ర అధ్యక్షులు సి శంకర్, రాష్ట్ర కమిటి సభ్యులు, ఆయా జిల్లాల నేతలు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

317 జిఒను సవరించి ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

317 జిఒను సవరించి ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద ఆదివారం 317 జిఒ బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు మహా ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో ఉపాధ్యాయ సంఘాల నేతలు మారిశెట్టి తిరుపతిరావు, సదానంద గౌడ్, భుజంగరావు, నాగేశ్వరరావు, వినోద్‌లు హాజరై మాట్లాడారు. ప్రస్తుతం ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు చేపడుతున్న తరుణంలో స్థానికత కోల్పోయిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు స్థానికత కల్పించాలని డిమాండ్ చేశారు. సంవత్సరం నుంచి తాము పోరాటం చేస్తున్నా ముఖ్యమంత్రి కెసిఆర్ స్పందించడంలేదన్నారు.

సిఎం తమ మీద ఎందుకు ఇంత కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతునారని ప్రశ్నించారు. తాము గొంతెమ్మ కోరికలు కోరడం లేదని.. స్థానికత ఆధారంగా తమను ట్రాన్స్‌ఫర్ చేయాలని కోరుతున్నామని తెలిపారు. భార్యాభర్తల్ని విడదీయకుండా ఒకే దగ్గర ఉండే విధంగా బదిలీ చేయాలన్నారు. జిఒ 317 వల్ల తాము 200, 300 కిలోమీటర్ల ప్రయాణం చేసి పిల్లలకు విద్యా బోధించగలమా అని ఆవేదన వ్యక్తం చేశారు. చదివింది ఎక్కడో ఉద్యోగం అక్కడే కల్పించాలని కోరారు. 317 జిఒను సవరించి ఉపాధ్యాయులకు న్యాయం చేయకపోతే ఫిబ్రవరి మూడు నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాలను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ ధర్నాలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘ నాయకులు పాల్గొన్నారు.

ప్రయివేటు కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కోచింగ్‌ల పేరిట వేలాది రూపాయలు వసూలు చేస్తున్న ప్రయివేటు కోచింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేశ్ డిమాండ్ చేశారు. నారాయణగూడలో డివైఎఫ్ఐ నగర కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్‌లో గ్రూప్ 1,2,3,4, ఎస్ఐ, కానిస్టేబుల్ ఇతర పోటీ పరీక్షల శిక్షణ పేరిట విపరీత దోపిడీ జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కనీస నిబంధనలు పాటించకుండా, ఫైర్ సేఫ్టీ లేకుండా. ఇరుకు గదులు, ఫంక్షన్ హాల్స్, ఇతర ప్రాంతాల్లో నిర్వహిస్తున్న తీరును వివరించారు. కనీసం తాగడానికి నీళ్లనూ అందుబాటులో ఉంచడం లేదని, టాయిలెట్స్ లేకుండా కోచింగ్ సెంటర్లు నడుపుతున్నారని తెలిపారు. అలాంటి వాటిపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరి ంచారు.

నేడు అనాథల అరిగోస దీక్ష

- మంద కృష్ణ మాదిగ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అనాథల అరిగోస దీక్షను చేపట్టనున్నట్టు మంద కృష్ణ మాదిగ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద సోమవారం చేపట్టనున్న దీక్షకు వివిధ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల నేతలు హాజరవుతారని పేర్కొన్నారు. కెసిఆర్ ప్రభుత్వం అనాథలకు ఎన్నో హామీలు ఇచ్చిందని, ఆ హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోందని విమర్శించారు. అనాథల సంక్షేమం కోసం నియమించబడ్డ మంత్రి వర్గ ఉప సంఘం ఎన్నో తీర్మానాలు చేసిందని, వాటిని అమలు చేయటం లేదని తెలిపారు. మంత్రి వర్గ ఉపసంఘం సిఫారసులు, ప్రభుత్వ హామీలను అమలు చేయాలని కోరతూ దీక్ష చేస్తున్నట్టు తెలిపారు.

మొగల్ గార్డెన్ పేరు మార్చటం సమంజసం కాదు

- ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశ రాజధాని న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో గల మొగల్ గార్డెన్ పేరును అమృత్ ఉద్యాన్‌గా మార్చటం సమంజసం, సమర్ధనీయం కాదని ఎమ్మెల్యే అలుగుబెల్లి నర్సిరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మొగల్ గార్డెన్ పేరునే కొనసాగించాలని కేంద్రాన్ని కోరారు. ఆ పేరు మార్చటం వల్ల భారతీయ సమాజానికి జరిగే మేలు లేశమాత్రమైనా లేదని తెలిపారు. దేశ ప్రజల్లో విభజన పెరగటానికి ఇలాంటి చర్యలు దారితీస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. కొత్త నిర్మాణాలకు పాలకులు తమకు అనుకూలమైన పేరు పెట్టుకోవటాన్ని అర్థం చేసుకోవచ్చునని తెలిపారు. కానీ 75 ఏళ్ల స్వతంత్ర భారతంలో అవసరంరాని పేరు మార్పిడి ఇప్పుడెందుకు అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు పౌరులందరికీ బాధ్యత వహించే విధంగా ఉండాలని సూచించారు. ప్రజల మధ్య విభజన రేఖ తీసుకొచ్చే ఇలాంటి చర్యలకు స్వస్తి పలకాలని విజ్ఞప్తి చేశారు.

రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు 30 శాతం నిధులు కేటాయించాలి : ఎఐఎస్ఎఫ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యా రంగానికి రాష్ట్ర బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయించాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఉద్యమ సమయంలో రాష్ట్రమొచ్చాక విద్యకు ప్రతి బడ్జెట్‌లోనూ అధిక ప్రాధాన్యత ఇస్తామని సిఎం కెసిఆర్ చెప్పి ఇప్పుడు అమలు చేయడం లేదని విమర్శించారు. 2014-15లో విద్యకు బడ్జెట్‌లో పది శాతం నిధులు కేటాయిస్తే 2021-23 నాటికి అది ఆరు శాతానికి తగ్గిపోయిందని పేర్కొన్నారు. మహారాష్ట్ర, తమిళనాడు, కేరళ, ఢిల్లీ రాష్ట్రాల్లో విద్యకు 25 శాతం నిధులు కేటాయిస్తుంటే ఇక్కడ సగమైనా ఇవ్వడం లేదని విమర్శించారు. ఢిల్లీలో అమలు చేస్తున్న ప్రభుత్వ విద్య విధానాన్ని మన రాష్ట్రంలోనూ అమలు చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఉస్మానియా యూనివర్సిటీకి వెయ్యి కోట్ల రూపాయలను కేటాయించాలని డిమాండ్ చేశారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా హాస్టల్ విద్యార్థులకు మెస్ ఛార్జీలు పెంచాలని, ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు.

బడ్జెట్‌లో వికలాంగులకు ఐదు శాతం నిధులు కేటాయించాలి

- నేడు కలెక్టరేట్ల ముందు ధర్నాలు : ఎన్‌పిఆర్‌డి పిలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వికలాంగులకు రాష్ట్ర బడ్జెట్లో ఐదు శాతం నిధులు కేటాయించాలని, ఆసరా పెన్షన్ల మంజూరుకు ఆదాయపరిమితి విధించే జిఒ నెంబర్ 17ను రద్దు చేయాలని కోరుతూ సోమవారం రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల ముందు ధర్నాలను చేపట్టినట్టు వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డి) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె వెంకట్, ఎం అడివయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వయం ఉపాధి కోసం వేలాదిమంది నిరుద్యోగులు దరఖాస్తులు చేసుకున్నారని, 25 శాతం మందికి కూడా రుణాల మంజూరు చేయలేదని పేర్కొన్నారు. వికలాంగుల వివాహ ప్రోత్సాహం కోసం గతేడాది 711 మంది దరఖాస్తు చేసుకుంటే 240 మందికి మాత్రమే మంజూరు చేశారని గుర్తుచేశారు. బ్యాటరీ వీల్ చైర్ల కోసం రెండు వేల మంది దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. 2022 ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నప్పటికీ దరఖాస్తు చేసుకున్న వారందరికీ పరికరాలు పంపిణీ చేయలేదని ఆందోళన వ్యక్తం చేశారు. బడ్జెట్‌లో అవసరమైన నిధులు కేటాయించి, స్వయం ఉపాధి రుణాలు, పరికరాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

దళిత బంధుకు రూ.20వేల కోట్లు కేటాయించాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

దళితబంధు కోసం 2022-23 బడ్జెట్‌లో రూ.20 వేల కోట్లు కేటాయించాలని, దళితులు, పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలని కోరుతూ వచ్చే నెల తొమ్మిదిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జాన్ వెస్లీ, టి స్కైలాబ్ బాబు తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించినట్టు పేర్కొన్నారు. దళితబంధు పథకాన్ని హైకోర్టు తీర్పుమేరకు రాజకీయాలకతీతంగా అర్హులను అధికారుల ద్వారా ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు.ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించాలని విజ్ఞప్తి చేశారు. పారదర్శకంగా గ్రామసభలు నిర్వహించి అర్హులను ఎంపిక చేయాలని పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో నియోజకవర్గ పరిధిలోని 5,000మందికి దళితబంధు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

స్పౌజ్ బదిలీలకు అనుమతిచ్చారు... మాకూ ఇవ్వండి

- సిఎం కెసిఆర్‌కు రాష్ట్ర స్పౌజ్ ఫోరం విజ్ఞప్తి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉపాధ్యాయ స్పౌజ్ బదిలీలకు అనుమతిచ్చినందుకు సిఎం కెసిఆర్, విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డికి స్పౌజ్ ఫోరం కృతజ్ఞతలు తెలిపింది. అదే తరహాలో తమకూ చేయాలంటూ 13 జిల్లాల ఎస్‌జిటి, ఎల్‌పి, పిఇటి ఉపాధ్యాయులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు హైదరాబాద్ సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో స్పౌజ్ ఫోరం అధ్యక్షులు వివేక్, నాయకులు విజయలక్ష్మి, మాధవి, మమతా, షబానాబేగం తదితరులు విలేకర్లతో మాట్లాడారు. సాంకేతిక కారణాలతో 13 జిల్లాల్లో ఉపాధ్యాయ దంపతులకు బదిలీలు నిలిచిపోయాయని పేర్కొన్నారు. సిఎం కెసిఆర్, ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు చొరవ ఫలితంగా ఉపాధ్యాయ దంపతులకు బదిలీ ఉత్తర్వులు వెలువడ్డాయని తెలిపారు. ఉద్యోగులైన దంపతులు ఒకే చోట ఉంటే మంచి ఫలితాలు సాధించగలమని ఆశాభావం వ్యక్తం చేశారు. దంపతులైన ఉద్యోగులు ఒకే క్యాడర్ పనిచేసేందుకు వీలుగా మెమో 1655 తీసుకొచ్చినన విషయాన్ని గుర్తు చేశారు. విద్యాశాఖ మంత్రిని కలిసి తమ సమస్యలను పరిష్కరించాలని కోరామని, అందుకు సానుకూలంగా స్పందించారని తెలిపారు.

IN THE COURT OF THE HON'BLE XVII ADDITIONAL SENIOR CIVIL JUDGE : CCC : AT :: HYDERABAD
O.S.No. 709 of 2017
Between:-
Sri Chauhan Motilal, S/o. Late. Chauhan Laxman, Aged about 85 years, Occ: Business, R/o H.No. 5-8-45(Laksh), Fateh Sultan Lane, Nampally, Hyderabad. ....Plaintiff
AND
Smt. Revuri Radha Bai (Died) per Lr's and others ....Defendants
3) R.Balraj, S/o.Late R.Krishna Murthy, Aged about 51 years, Occ: Business, R/o.H.No.13-1-1146/A/69/A, Laxminagar, Asif Nagar, Hyderabad.
4) R.Prabhu, S/o.Late R.Krishna Murthy, Aged about 50 years, Occ: Business, R/o.H.No.13-1-169/1, Mustadipura, Jehhra, Hyderabad.
5) R.Satish, S/o.Late R.Krishna Murthy, Aged about 46 years, Occ: Business, R/o.H.No.18-14/A, Lingampally, HYD.
6) R.Mallikarjun, S/o.Late R.Krishna Murthy, Aged about 42 years, Occ: Business, R/o.H.No.13-2-267/A/35, Raheempura, Hyderabad.
.....Defendants.no.3 to 6

Please take notice that the above named Plaintiff filed a Suit for Eviction before the Hon'ble XVII Additional Senior Civil Judge at Hyderabad, to evict the Defendants from the Suit Schedule Premises and to direct the Defendants to pay the arrears of rents and mesne profits. The said case is posted to **02-02-2023** for **Defendants.no.3 to 6 appearance,** and the Defendants.no.3 to 6 are hereby directed to appear before the above said Hon'ble Court in person/s or through your advocate/s on **02-02-2023** at **10-30 A.M**, failing which, the said Hon'ble Court will decide the said suit.

(BY ORDER OF THE COURT)
K.L.B. KUMAR)
Advocate
Flat No. G-2, H.No.11-5-8, Happy Home Castle Apart., Red Hills, Nampally, Hyderabad – 500004. Ph: 9866301129
Counsel for the Plaintiff

ఆన్‌లైన్ మూల్యాంకనాన్ని స్వాగతిస్తున్నాం

- తెలంగాణ ఇంటర్ విద్యా పరిరక్షణ సమితి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఇంటర్మీడియట్ విద్యలో ఆన్‌లైన్ మూల్యాంకనం చేయాలనే విద్యాశాఖ నిర్ణయాన్ని తాము స్వాగతిస్తున్నామని తెలంగాణ ఇంటర్ విద్యా పరిరక్షణ సమితి పేర్కొంది. ఆదివారం ఈ మేరకు ఆ సమితి రాష్ట్ర కన్వీనర్ మాచర్ల రామకృష్ణగౌడ్, సమన్వయకర్త మైలారం జంగయ్య, ప్రభుత్వ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కొప్పిశెట్టి సురేశ్, సమితి కో-కన్వీనర్లు లక్ష్మయ్య, మంజునాయక్, పరశు రాములు, సైదులు, చంద్రయ్య, డాక్టర్ వస్కుల శ్రీనివాస్, పిఆర్ఒ శోభన్‌బాబు ఒక ప్రకటన విడుదల చేశారు. మొదటిగా లాంగ్వేజ్, హ్యూమానిటీస్ సబ్జెక్టులపై ప్రయోగాత్మకంగా చేపట్టనుండడం శుభపరిణామం అని పేర్కొన్నారు. దీనివల్ల బోర్డుకు అనవసరపు ఖర్చులు తగ్గుతాయనీ, విద్యార్థులకు నష్టం జరుగకుండా కచ్చితమైన మూల్యాంకనం చేయడం వలన ఫలితాలను సాధ్యమైనంత త్వరగా ఇచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. మార్కుల విషయంలో ఏమైనా హెచ్చుతగ్గులు వచ్చాయని భావిస్తే తక్షణమే వారి పేపర్‌ను వెంటనే డౌన్‌లోడ్ చేసుకొని వారికున్న సందేహాలను తీర్చుకోవచ్చని పేర్కొన్నారు. ఆన్‌లైన్ మూల్యాంకనంపై కొందరు వ్యక్తులు తప్పుడు ప్రచారం చేయడం తగదనీ, విద్యార్థులను అనవసరపు ఆందోళనలకు గురిచేయొద్దని కోరారు. అధ్యాపకులందరూ వారివారి సబ్జెక్టులలో మంచి అనుభవం ఉన్న వారే కావడం వలన అధ్యాపకులకు "ఆన్ లైన్" మూల్యాంకనంలో అవగాహన కల్పించడానికి మూడు, నాలుగు రోజుల సమయం సరిపోతుందని తెలిపారు.

ప్రజావ్యతిరేక విధానాలను తిప్పి కొట్టండి

- రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగర్
- ఏప్రిల్ 5న ఢిల్లీలో కదం తొక్కండి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర ప్రభుత్వ అవలంబిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్ అన్నారు. ఆదివారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని సిఐటియు కార్యాలయంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జిల్లా సదస్సును సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ.. ప్రజా సంఘాల ఐక్యవేదిక, సిఐటియు, తెలంగాణ రైతు సంఘం, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఏప్రిల్ ఐదవ తేదీన దేశ రాజధాని ఢిల్లీ నడిబొడ్డున పది లక్షల మందితో కేంద్ర ప్రభుత్వంపై సమర శంఖం పూరించేందుకు ప్రజలు కదం తొక్కాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు వ్యవసాయ చట్టాలను తీసుకువచ్చి వ్యవసాయాన్ని కార్పొరేటీకరించేందుకు ప్రయత్నించిందని తెలిపారు. దానిపై ఏడాదిపాటు పోరాడిన రైతులు, వారు చేసిన త్యాగాల ఫలితంగా చట్టాలను వెనక్కి తీసుకున్నదని గుర్తుచేశారు. కాని వాటిని దొడ్డిదారిలో అమలు చేసేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. అలాగే, విద్యుత్ సవరణ బిల్లును వెనక్కు తీసుకోవాలని, ఉపాధి హామీ చట్టానికి నిధుల కేటాయింపులు, 200 పనిదినాలు, కనీస వేతనం రోజుకు రూ. 600 నిర్ణయించాలని డిమాండ్ చేశారు. బడా పారిశ్రామికవేత్తల ప్రయోజనాల కోసం తర్వాత 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా తెచ్చి కార్మికులను కట్టు బానిసలుగా మార్చాలని చూస్తోందన్నారు. వీటన్నింటికి వ్యతిరేకంగా ఏప్రిల్ ఐదున నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు, పాల్గొన్నారు.

చివరి స్థానంలో డబుల్ ఇంజిన్ సర్కార్

- కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు వెనుకంజ
- ఇప్పటికీ కేరళ నెంబర్‌వన్ స్థానమే...
- మంత్రి హరీశ్‌రావు
- వైద్యారోగ్య రంగం 2022 వార్షిక నివేదికను విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తమ ప్రభుత్వం డబుల్ ఇంజిన్ సర్కార్ అంటూ చెప్పుకుంటున్న బిజెపి పాలిత ఉత్తర్ ప్రదేశ్ వైద్యారోగ్య రంగంలో చివరి స్థానంలో ఉందని వైద్యారోగ్యశాఖ మంత్రి టి హరీశ్‌రావు తెలిపారు. హైదరాబాద్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆ శాఖ 2022 వార్షిక నివేదికను విడుదల చేశారు. ఛార్జ్‌షీట్ పేరుతో తెలంగాణ వైద్యారోగ్యశాఖ పనితీరును విమర్శించిన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ముందు ఆ పార్టీ పాలిస్తున్న రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల్లో సేవలెలా ఉన్నాయో తెలుసుకోవాలని హితవు పలికారు. నిటిఅయోగ్ విడుదల చేసిన ర్యాంకింగ్‌లో కేరళ మొదటి స్థానంలో ఉంటే తెలంగాణ మూడో స్థానంలో ఉందని, రాజస్థాన్ 16వ స్థానంలో ఉంటే, ఛత్తీస్‌ఘడ్ పదో స్థానంలో ఉందని తెలిపారు. రాష్ట్రంలోనూ కాంగ్రెస్ పాలించిన సమయంలో ప్రభుత్వాస్పత్రుల్లో సౌకర్యాలు లేక డెలివరీలు తగ్గాయని, టిఆర్ఎస్ పాలనలో అవి రెట్టింపయ్యాయని చెప్పారు. రాష్ట్ర వైద్యారోగ్యశాఖ 2022 వార్షిక నివేదికను ఆ రాష్ట్రాలకు పంపించి అమలు చేయిస్తే మంచిదని సూచించారు. తమిళనాడు, మహారాష్ట్రలు కొన్ని విషయాల్లో తెలంగాణ కన్నా మెరుగ్గా ఉన్నాయంటూ, కేరళతో పాటు మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలకు వెళ్లి ఆయా విషయాలను అధ్యయనం చేసి మన రాష్ట్రంలో అమలు చేయాలని అధికారులను ఆదేశించినట్టు మంత్రి తెలిపారు. చిన్న, చిన్న ఘటనలు మినహా 2022 సంవత్సరం రాష్ట్ర వైద్యారోగ్య చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన ఏడాదని అభిప్రాయపడ్డారు. ఏదైనా సంఘటన జరిగినప్పుడు వెంటనే సమీక్షించుకుంటున్నామని, అలాంటివి పునరావతం కాకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ఎంఎంఆర్ రేట్ 56 నుంచి 43కు, ఐఎంఆర్ రేటు 23 నుంచి 21కి తగ్గించామన్నారు. లక్ష మంది జనాభాకు 19 ఎంబిబిఎస్ సీట్లతో దేశంలో నెంబర్‌వన్‌గా నిలిచామనీ, వైద్య పీజీ సీట్ల విషయంలో లక్షకు ఏడు సీట్లతో రెండో స్థానానికి చేరినట్టు వెల్లడించారు. హైదరాబాద్ నలువైపులా నాలుగు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు, గచ్చిబౌలిలో అదనంగా 1,000 పడకలు, నిమ్స్‌లో 2,000, వరంగల్ సూపర్ స్పెషాలిటీలో మరో 2,000 మొత్తం కలిపి 8,200 బెడ్లు అదనంగా రానున్నాయని తెలిపారు. భూకేటాయింపులు, పనులు ప్రారంభమయ్యాయని మంత్రి తెలిపారు. ఔట్ పేషెంట్ల సంఖ్య 60 లక్షలు, ఇన్‌పేషెంట్ల సంఖ్య దాదాపు మూడు లక్షలు, సర్జరీలు 50 వేలు పెరిగిందన్నారు. రక్తహీనత ఉన్న గర్భిణుల కోసం కెసిఆర్ న్యూట్రిషన్ కిట్ పథకం ప్రారంభించామని చెప్పారు. 926 మంది డాక్టర్ల నియామకం ఒకే రోజు చేశామని, తొమ్మిది మెడికల్ కాలేజీల ప్రారంభానికి ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేశామని, రాష్ట్రంలో 5.40 లక్షల డెలివరీలు జరిగితే అందులో 3.27 లక్షలు (61 శాతం) ప్రభుత్వాస్పత్రుల్లో జరిగాయని తెలిపారు. ఆస్పత్రుల్లో డెలవరీల శాతం 97 నుంచి 99.9 శాతానికి పెరిగిందన్నారు.

ప్రతి మరణంపై ఆడిట్ నిర్వహిస్తున్నామని, సీ సెక్షన్‌కు ఇన్సెంటివ్ ఇచ్చే బదులు సహజ ప్రసవాలకు ఇవ్వడాన్ని ప్రారంభించామని, దీన్ని కేంద్రం ప్రశంసించి మిగిలిన రాష్ట్రాలు అనుసరించాలని సూచించిందని మంత్రి తెలిపారు. ఇబ్రహీంపట్నం ఘటన తర్వాత ప్రతి ఆస్పత్రిలో ఇన్ఫెక్షన్ టీంలను ఏర్పాటు చేసి శిక్షణ ఇచ్చామన్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో 716 అవయవమార్పిడి శస్త్రచికిత్సలు జరిగాయన్నారు. పేషెంట్ డైట్ ఛార్జీలను రూ.40 నుంచి రూ.80కి పెంచామని, 18 ఎంపిక చేసిన ఆస్పత్రుల్లో సహాయకులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నారు. పారిశుధ్య పనుల నిర్వహణకు ఒక బెడ్‌కు ఇచ్చే రూ.5,000ను రూ.7,500 పెంచామని, దేశంలో ఎక్కడా లేని విధంగా డైట్, శానిటేషన్ కాంట్రాక్టులో ఎస్‌సి, ఎస్‌టిలకు 16 శాతం రిజర్వేషన్ కల్పించామన్నారు. పరికరాల మరమ్మతులు ఆలస్యం కాకుండా రాష్ట్ర స్థాయిలో ప్రాజెక్ట్ మేనేజ్ మెంట్ యూనిట్ (పిఎంయు) ఏర్పాటు సత్ఫలితాలనిచ్చిందని మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆరోగ్యశ్రీ కింద కుటుంబానికి ఇచ్చే కవరేజీ రూ.రెండు లక్షల నుంచి రూ.ఐదు లక్షలకు పెంచామనీ, అవయవమార్పిడి, దీర్ఘకాలిక రోగాలు వంటి ప్రత్యేక సందర్భాల్లో రూ. పది లక్షల వరకూ ఇస్తున్నామన్నారు.

12,755 ఖాళీల భర్తీకి నిర్ణయం తీసుకున్నామని, 1,047 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు, 5,024 స్టాఫ్ నర్సు పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చామన్నారు. మూడంచెల వైద్య వ్యవస్థ ఐదెంచలుగా మారిందని, 2,500 పల్లె దవాఖానాలు అందుబాటులోకి రానున్నాయన్నారు. ఆయా విభాగాల్లో పలు అవార్డులు వచ్చాయంటూ అధికారులు, సిబ్బందికి అభినందనలు తెలిపారు.

2023లో సరోజినీదేవి కంటి ఆస్పత్రి, కోఠిలోని ఇఎన్‌టి ఆస్పత్రిలను బలోపేతం చేస్తామని తెలిపారు. ముఖ్యంగా ఆహార కల్తీ నివారణకు ఫుడ్ సేఫ్టీ ల్యాబ్ బలోపేతం, ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ల సేవలను పూర్తి స్థాయిలో వినియోగించుకుంటామని హరీశ్‌రావు తెలిపారు. మలక్ పేట ఘటనపై పై, ఉద్దేశపూర్వక నిర్లక్ష్యం బయటపడితే విధుల్లో నుంచి తొలగిస్తామని తెలిపారు. రెండు జిల్లాల్లో హెల్త్ ప్రొఫైల్ నిర్వహించామని, మిగిలిన జిల్లాల్లోనూ కొనసాగిస్తామని ప్రకటించారు. ఈ సమావేశంలో వైద్యారోగ్యశాఖ కార్యదర్శి రిజ్వీ, రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ జి శ్రీనివాసరావు, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ కమిషనర్ శ్వేతా మహంతి తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

సంప్రదయ కళలు తెలుగు వారికి గుర్తింపు తెస్తాయి

- పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దామోదర్

ప్రజాశక్తి - కల్చరల్

సంప్రదయ కళలు, పండుగలు తెలుగు వారికి గుర్తింపు తెస్తాయని, వీటిని పరిరక్షించుకుంటూ ముందు తరాలకు అందించాల్సిన అవసరముందని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ అన్నారు. రవీంద్రభారతి ప్రధాన వేదికపై భారత్ ఆర్ట్స్ అకాడెమీ, ఎబిసి ఫౌండేషన్ నిర్వహణలో సంక్రాంతి సంబరాలు పేరిట సంగీత నృత్య కార్యక్రమాలు జరిగాయి. ఉభయ తెలుగు రాష్టాల నుంచి పలువురు కళాకారులు శాస్త్రీయ నృత్యాలతో లలిత గీత గానంతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.

అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా దామోదర్ పాల్గొని మాట్లాడారు. సంస్కృతిని సామాన్యులకుసైతం అందించేలా భారత్ ఆర్ట్స్ అకాడమీ వేదిక కల్పిస్తోందని, వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారుల ప్రదర్శనలు ఇప్పించడం అభినందనీయమన్నారు. భారత్ వరల్డ్ రికార్డ్ అధ్యక్షుడు లయన్ కె.వి.రమణారావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ రెండు వందలకుపైగా నృత్య సంగీత కళాకారులు అన్ని వయస్సుల వారూ ప్రదర్శనలో పాల్గొన్నారని తెలిపారు. బోనాల ప్రతినిధి శ్యామలదేవి, నటి శైలజ, ప్రిన్స్ సెస్‌నైరా తదితరులు సభలో పాల్గొన్నారు. సామాజిక సేవకుడు సత్యవేణి శర్మ, శ్వేత, నిర్మల, నాట్య సంగీత గురువులు పద్మజ, కల్యాణి, మాధురి, మైధిలి, శ్రీ లక్ష్మి, శివ జ్యోతి, వరలక్ష్మి, రేఖ, బద్రినాధ్, సమంత రావు, నవ్య, పద్మావతి, శైలజ తదితరులను సంక్రాంతి నంది పురస్కారాలతో సత్కరించారు. లలితారావు నిర్వహణలో జరిగిన సత్కార కార్యక్రమంలో రమణారావు స్వాగతం పలికారు.

ప్రతిభావంత బ్రాహ్మణులను ప్రభుత్వాలు గుర్తించాలి

- బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య వినతి

ప్రజాశక్తి - కల్చరల్

బ్రాహ్మణ సమాజంలో ప్రతిభావంతులైన వారు ఉన్నా వారికి తగిన గుర్తింపులేదని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారిని అర్హత గల పదవులకు ఎంపిక చేయాలని తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య కోరారు. తెలుగు విశ్వవిద్యాలయంలోని ఎన్‌టిఆర్ కళా మందిరంలో సమాఖ్య నిర్వహణలో నీటి పారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా ఇటీవల నియమితులైన డాక్టర్ సముద్రాల వేణుగోపాలాచారి సత్కార సభ జరిగింది. వివిధ బ్రాహ్మణ సంఘాలకు చెందిన ప్రతినిధులు డాక్టర్ సునీతాదేవి, నరేంద్ర, సూర్యకుమారి, గాయకుడు రామాచారి నాగేశ్వర సిద్ధాంతి, తదితరులు వేణు గోపాలాచారిని ఘనంగా సత్కరించారు. వారు మాట్లాడుతూ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్‌గా రమణాచారి సమర్ధవంతంగా, వివాద రహితంగా పనిచేస్తున్నారని, వారికి మరింత ఉన్నత పదవి ఇస్తే ప్రభుత్వ ప్రతిష్ట పెరుగుతుందని తెలిపారు. బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ డాక్టర్ కెవి.రమణ అధ్యక్షత వహించి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కెసిఆర్‌కు బ్రాహ్మణుల పట్ల గౌరవం ఉందని అన్నారు. ఏప్రిల్‌లో జరిగే బ్రాహ్మణ గర్జన మహసభను విజయవంతం చేయలని కోరారు.

గుండెకు శక్తినిచ్చే కార్డియాక్ రిహాబ్

- గుండెపోటుకు గురైన వారికీ ఉపయోగం
- డాక్టర్ మురళీధర్ బాబీ
- మారథాన్‌లో పాల్గొన్న 20 మంది గుండె వ్యాధిగ్రస్తులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కార్డియాక్ రిహాబ్ గుండెకు తగిన బలాన్నిస్తుందనీ, గుండెపోటుకు గురైన వారికి ఉపయోగకరంగా ఉందని స్వచ్ఛంద సేవా సంస్థ కార్డియాక్ రిహాబ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ఇఎస్ఐసి మెడికల్ కాలేజీ హాస్పిటల్ అసిస్టెంట్ ప్రొఫెసర్, కార్డియాక్ రిహాబ్ స్పెషలిస్ట్ డాక్టర్ మురళీధర్ బాబీ తెలిపారు. ఇనార్బిట్ మాల్ ఆధ్వర్యంలో హైదరాబాద్ దుర్గం చెరువు వద్ద ఆదివారం నిర్వహించిన రన్‌లో 20 మంది గుండె సంబంధిత రోగులు పాల్గొన్నారు. గతంలో గుండె జబ్బులు, శస్త్రచికిత్సలు జరిగాయంటే పడకకు, ఇంటికి పరిమితమయ్యేవారు. బరువైన పనులు, పరుగులు పెట్టేందుకు ఇబ్బందులు పడే వారు. కానీ కార్డియాక్ రిహాబ్ అందుబాటులోకి వచ్చాక ఆ పరిస్థితి మారింది. ఇప్పుడు వారు వరుసగా మారథాన్‌లలో పాల్గొంటున్నారు. కార్డియాక్ రిహాబ్ రన్నర్లలో ఇప్పటికే హార్ట్ అటాక్ గురై కోలుకున్న వారు, యాంజియోప్లాస్టీ అయినవారు, బైపాస్, మైనర్ బ్లాక్‌లతోపాటు డయాలెటెడ్ కార్డియోమైయోపతీ (డిసిఎం), పల్మనరీ ఆర్టియల్ హైపర్ టెన్షన్ (పిఎహెచ్) రోగులుండడం గమనార్హం. వీరంతా మూడు నుంచి ఆరు నెలలపాటు గుండె వ్యాయామాలు చేసి దాని పంపింగ్ సామర్థ్యాన్ని పెంచుకుని కుటుంబంలో అందరి కన్నా ఫిట్నెస్‌గా మారి మారథాన్‌లలో పాల్గొంటుండడం విశేషం. ఈ సందర్భంగా డాక్టర్ మురళీధర్ బాబీ మాట్లాడుతూ కార్డియాక్ రిహాబ్‌తో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. డయాబెటీస్ వచ్చే రిస్క్ ఫ్యాక్టర్ తగ్గిపోతుందనీ, హైబ్లడ్ ప్రెషర్ వారికి హార్ట్ అటాక్ వచ్చే ప్రమాదం తగ్గుతుందనీ, ఆత్మస్థైర్యం పెరిగి మెరుగైన జీవితం లభిస్తుందని తెలిపారు. రిహాబ్‌లో వ్యాయామాలు చేసిన మూడు నెలల తర్వాత, రిహాబ్ అయిన మూడు నెలల తర్వాత వీరిలో షుగర్, బిపి తగ్గిపోవడం, స్మోకింగ్, డ్రింకింగ్ అలవాట్ల నుంచి బయటికి రావడమే కాకుండా శారీరకంగా చాలా ఫిట్‌గా అవుతున్నారని తెలిపారు.

గాంధీజీ హత్య వెనుక కుట్ర

- తెరవెనుక సావర్కర్, ఆర్ఎస్ఎస్
- ఓ వ్యక్తి చేసిన అఘాయిత్యంగా ప్రచారం
- పుస్తకావిష్కరణలో వక్తలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహాత్మాగాంధీ హత్యకు సంబంధించిన సమాచారం పాక్షికంగానే జనబాహుళ్య ప్రచారంలో ఉందనీ, దాని వెనుక అతిపెద్ద సైద్ధాంతిక ఘర్షణ, కుట్ర ఉన్నాయని ప్రముఖ రచయిత ధీరేంద్ర కే ఝా అన్నారు. ఈ కుట్రకోణాన్ని సాక్ష్యాధారాలతో ప్రజల ముందు ఉంచే ప్రయత్నం తాను చేసినట్టు చెప్పారు. తెలంగాణలోని నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్ ఆధ్వర్యంలో ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం (ఎస్‌వికె)లో ధీరేంద్ర కే ఝా రచించిన 'గాంధీజీ హంతకుడు' (గాడ్సే జీవితం, ఆలోచనలు, అనుబంధాలు) తెలుగు అనువాద పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ పుస్తకాన్ని ఎస్‌వికె ట్రస్టు కార్యదర్శి ఎస్ వినయకుమార్ తెలుగులోకి అనువాదం చేశారు. ఢిల్లీ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ తిరుమలి ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ధీరేంద్ర కే ఝా ఆన్‌లైన్ ద్వారా పాల్గొని మాట్లాడారు. గాంధీ-గాడ్సేల ఆలోచనల సైద్ధాంతిక ఘర్షణను 2014 తర్వాత బిజెపి ముందుకు తెస్తున్నదని వివరించారు. గాడ్సేను దేశభక్తుడిగా కొలిచే ప్రకటనలు వెలువడుతున్నాయనీ, అసత్య ప్రచారంతో చరిత్రను మార్చే ప్రయత్నం జరుగుతోందని చెప్పారు. గాంధీ హత్యకు గల కారణలపై కేరవాన్ పత్రికలో వ్యాసం కోసం పరిశోధన చేసేటప్పుడు అనేక ఆసక్తికర అంశాలు వెలుగులోకి వచ్చాయనీ, వాటిని సాక్ష్యాధారాలతో ప్రజలకు చెప్పాలనే పరిశోధనను కొనసాగించి పుస్తకం రాసినట్టు తెలిపారు.

తిరుమలి మాట్లాడుతూ.. మహాత్మాగాంధీని హత్య చేసింది గాడ్సే అనే ఓ వ్యక్తి కాదనీ, దాని వెనుక ఆర్ఎస్ఎస్, సావర్కర్ కుట్ర ఉన్నదని స్పష్టం చేశారు. బ్రిటీష్ వాళ్లు భారతదేశానికి స్వాతంత్ర్యం ప్రకటించాక, దేశంలో తిరిగి పీష్వాల పాలన తీసుకురావలనేది సావర్కర్ ఆలోచన అనీ, గాంధీ హత్యతో దానికి మార్గం సుగమం అవుతుందని భావిస్తే, ప్రజల నుంచి వచ్చిన వ్యతిరేకత ఆ ప్రయత్నాన్ని నిలుపుదల చేసిందన్నారు. మహాత్మాగాంధీ అంతటి ధైర్యవంతుడు సావర్కర్ కాదనీ, స్లీపర్‌సెల్‌గా ఉంటూ తన ఉద్రేక ప్రసంగాలతో యువకులను హిందూ తీవ్రవాదం వైపు నడిపించే ప్రయత్నం చేశారని చెప్పారు. గాడ్సే, ఆప్టే, కర్క్, పోవా వంటి వారు సావర్కర్ ప్రసంగాలకు ప్రభావితులైన వారేనన్నారు. గాంధీజీ హత్య తర్వాత సావర్కర్, ఆర్ఎస్ఎస్ తమకు ఎలాంటి సంబంధాలు లేవని ప్రకటించుకున్నాయనీ, కానీ చారిత్రక ఆధారాలు సేకరించి, ఈ కుట్రకోణాన్ని ప్రజలకు తెలిసేలా రచయిత కృషి చేశారని అన్నారు. గాంధీజీ కంటే ముందు ఇదే సావర్కర్ గ్యాంగ్ జిన్నాను హత్య చేయాలని పథకం పన్నారనీ, కానీ మౌంట్‌బాటన్ ఆయనతో కలిసి ఉండటం వల్ల అది సాధ్యం కాలేదని వివరించారు. గాంధీజీ హత్యను ఓ వ్యక్తి చేసిన హత్యగా చిత్రీకరించేందుకు సావర్కర్, ఆర్ఎస్ఎస్ తీవ్ర ప్రయత్నం చేశాయన్నారు. గాడ్సే కూడా ఆ తరహాలోనే న్యాయస్థానంలో స్టేట్‌మెంట్స్ ఇచ్చాడని చెప్పారు. గాంధీ హత్య విషయం అప్పటి హోంశాఖ మంత్రి సర్దార్ వల్లబాయ్ పటేల్‌కు ముందే తెలుసు అనీ, ఆయన సకాలంలో సరైన చర్య తీసుకొని ఉంటే, ఈ దారుణం జరిగి ఉండేది కాదని అభిప్రాయపడ్డారు. పుస్తక అనువాదకులు ఎస్ వినయకుమార్ మాట్లాడుతూ.. గాంధీజీ హత్య, ముంబయిలో సావర్కర్ సదన్‌పైకి ప్రజల దాడిని నియంత్రించడం, గుజరాత్‌లోని గోధ్రా, అహ్మదాబాద్ అల్లర్లకు సారూప్యత ఉన్నదని వివరించారు. చిప్పావన్ బ్రాహ్మణుల మీదే ఆర్ఎస్ఎస్ భావజాలం ఆధారపడి ఉంటుందనీ, బ్రాహ్మణ ఆధిపత్యాన్ని గాంధీ సవాలు చేస్తున్నారనే కోపం వారికి ఉన్నదని తెలిపారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్ ఎడిటర్ కే ఆనందాచారి మాట్లాడుతూ.. జనవరి 30 నాటికి గాంధీ హత్య జరిగి 75 ఏళ్లు పూరి అవుతాయనీ, దాని పూర్వాపరాలపై చర్చ జరగాలని అన్నారు. గాంధీ హంతకులను దేశభక్తులుగా కీర్తించబడుతున్నారనీ, అసత్యాలు సత్యాలుగా రాజ్యమేలుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. 20 ఏండ్లనాటి గుజరాత్ అల్లర్లపై బిబిసి డాక్యుమెంటరీ ప్రసారాలపైనా ఆంక్షలు విధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.కార్యక్రమంలో నవతెలంగాణ పబ్లిషింగ్‌హౌస్ గౌరవ సంపాదకులు గుడిపూడి విజయరావు, జనరల్ మేనేజర్ ఆర్ వాసు, కొండూరి వీరయ్య పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రిటైర్డ్ ప్రొఫెసర్ తిరుమలి, వినయకుమార్, ఆనందాచారి తదితరులు

నిరసన చేస్తున్న ఉపాధ్యాయులు

అక్రమ బదిలీలను వెంటనే ఆపేయాలి

- విద్యాశాఖ కార్యాలయం ఎదుట నిరసన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో జరుగుతున్న ఉపాధ్యాయుల బదిలీలకు జీరో సర్వీసును అనుమతించాలని, దొడ్డి దారిన జరుగుతున్న సెక్రటేరియట్ బదిలీలను వెంటనే ఆపివేయాలని యుఎస్‌పిసి స్టీరింగ్ కమిటీ రాష్ట్ర బాధ్యులు ఎ వెంకట్ డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ యుఎస్‌పిసి ఆధ్వర్యంలో ఆదివారం విద్యాశాఖ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోర్టు కేసులు లేని స్కూల్ అసిస్టెంట్ తెలుగు, హిందీ, పీడీ పోస్టులను అర్హత గల ఉపాధ్యాయులతో భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉపాధ్యాయ బదిలీ కౌన్సెలింగ్‌కు ముందు జీరో సర్వీసు కలిగిన ఉపాధ్యాయులందరినీ బదిలీకి అనుమతించాలన్నారు. 317 జిఒ ద్వారా సుదూర ప్రాంతంలో పనిచేస్తూ అనేక ఇబ్బందులు పడుతున్నటు వంటి ఉపాధ్యాయులను బదిలీలకు అనుమతించినట్టయితే వారికి ఎంతో కొంత ఉపశమనం కలుగుతుందని తెలిపారు. జిల్లాలో జరుగుతున్న పదోన్నతులు, బదిలీల జాబితా తయారీలో పారదర్శకత పాటించాలని కోరారు. ఒకవేళ అక్రమాలు జరుగుతున్నట్లయితే తీవ్రస్థాయిలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు స్వామి, అశోక్, శ్రీనివాస్, వృకోధర్, రామేశ్వర్, సుగుణ, జాదవ్ శ్రీనివాస్, లక్ష్మణ్, కిష్టన్న శంకర్, విలాస్, సేవాసింగ్, ఉదరి నారాయణ, ప్రేమల, పాల్గొన్నారు.

మ్యాప్‌ను పరిశీలిస్తున్న సంబంధిత అధికారులు

శరవేగంగా ఎయిర్‌పోర్టు మెట్రో విస్తరణ

- ఇంజినీర్ల బృందంతో కలిసి ఎన్‌విఎస్ రెడ్డి మెట్రో అలైన్‌మెంట్ పరిశీలన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎయిర్‌పోర్ట్ మెట్రో విస్తరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ మెట్రో నిర్మాణ పనుల కోసం సంబంధిత అధికారులు ఇప్పటికే స్థల సేకరణపై దృష్టిసారించిన విషయం తెలిసిందే. అదే సమయంలో ప్రయివేటు ఆస్తుల సేకరణ సాధ్యమయ్యేనంత మేర తగ్గించేలా.. ఎయిర్‌పోర్టు మెట్రో అలైన్‌మెంట్‌ను ఖరారు చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో లిమిటెడ్ (హెచ్ఎఎంఎల్) ఎండి ఎన్‌విఎస్ రెడ్డి సీనియర్ ఇంజనీర్ల బృందంతో కలిసి మెట్రో అలైన్‌మెంట్‌ను, స్టేషన్ స్థానాల ఎంపికను పరిశీలించారు. నార్సింగి అండర్‌పాస్ (మై హోమ్ అవతార్ జంక్షన్) నుంచి రాజేంద్రనగర్ గుట్ట వరకు దాదాపు పది కిలోమీటర్లు నడిచి.. అలైన్‌మెంట్‌లోని ప్రతి అంశాన్ని క్షుణంగా పరిశీలించారు. అనంతరం హెచ్ఎఎంల్ ఎండి అధికారులకు పలు మార్గదర్శకాలు, ఆదేశాలిచ్చారు. ఎయిర్‌పోర్ట్ మెట్రో అలైన్‌మెంట్‌ను ప్రయివేట్ ఆస్తుల సేకరణను నివారించే విధంగా లేదా సాంకేతికంగా సాధ్యమయ్యేంత వరకు తగ్గించే విధంగా ఖరారు చేయాలన్నారు. ప్రయాణీకులు స్టేషన్లకు సులువుగా చేరుకోవడానికి ఒఆర్ఆర్ అండర్‌పాస్‌లను ఉపయోగించేందుకు వీలుగా స్టేషన్లు నిర్మించాలని తెలిపారు. కారిడార్ పరిసరాల్లో నిర్మాణంలో ఉన్న ఎత్తైన వాణిజ్య, నివాస భవనాల వాసుల అవసరాలను తీర్చడానికి భవిష్యత్తులో అదనపు స్టేషన్ల నిర్మాణం కోసం గుర్తించబడిన ప్రదేశాల్లో మెట్రో వయాడక్ట్ ప్లాన్ చేయాలన్నారు. స్కైవాక్‌లు, ఇతర పాదచారుల సౌకర్యాలు స్టేషన్ ప్లానింగ్‌లో అంతర్భాగంగా ఉండాలని చెప్పారు. మెట్రో పిల్లర్లు నానక్‌రామ్‌గూడ జంక్షన్ నుంచి టిఎస్‌పిఎ (అప్పా) జంక్షన్ వరకు విస్తరించిన సర్వీస్ రోడ్డు సెంట్రల్ మీడియన్‌లో ఉండాలని, ఇది సర్వీస్ రోడ్డులో ఇప్పటికే చాలా ఎక్కువగా ఉన్న రహదారి ట్రాఫిక్ సజావుగా సాగేలా చేస్తుందని చెప్పారు. స్టేషన్ల యాక్సెస్ పాయింట్లు కొత్త సైకిల్ ట్రాక్‌కు అనుగుణంగా ఉండాలని, పర్యావరణహితంగా స్టేషన్లను చేరుకోవడానికి ఈ కొత్త సైకిల్ ట్రాక్ ఉపయోగపడుతుందిన సూచించారు. ఎయిర్‌పోర్టు మెట్రో ప్రయాణం మరింత వేగవంతం చేయడానికి, సజావుగా సాగేలా చేయడానికి కొన్ని ప్రదేశాల్లో వంపులు లేకుండా సాంకేతిక సాధ్యాసాధ్యాలను పరిశీలించాలన్నారు. స్టేషన్ల కోసం పార్కింగ్ సౌకర్యాల అభివృద్ధి, ప్రాజెక్ట్ వేగవంతం చేయడానికి తాత్కాలిక కాస్టింగ్ యార్డుల ఏర్పాటు కోసం కారిడార్ సమీపంలో తగిన బహిరంగ ప్రభుత్వ భూములను గుర్తించాలని అధికారులను ఆదేశించారు. పరిశీలనా బృందంలో.. హెచ్ఏఎంఎల్ చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ బి ఆనంద్ మోహన్, జనరల్ మేనేజర్లు ఎం. విష్ణువర్ధన్ రెడ్డి, రాజేంద్ర ప్రసాద్ నాయక్ పాల్గొన్నారు.

వ్యవసాయ రంగానికి అధిక నిధులు కేటాయించాలి

- సారంపల్లి, సత్యబాబు బోస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాలకు బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించాలని అఖిలభారత కిసాన్ సభ (ఎఐకెఎస్) జాతీయ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, పీపుల్స్ మానిటరింగ్ కమిటీ (పిఎంసి) జాతీయ కన్వీనర్ బిడిఎ సత్యబాబు బోస్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని కెవిపిఎస్ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం తెలంగాణ అగ్రి నెట్‌వర్క్, సిబిజిఎ సంయుక్తంగా నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి కనీసం పదిశాతానికి పైగా కేటాయించాలని డిమాండ్ చేశారు. వామపక్ష ప్రభుత్వం అధికారంలో ఉన్న కేరళ, పక్కనున్న కర్ణాటక, తమిళనాడు ప్రభుత్వాలు రైతులు పండించిన ధాన్యానికి ఇస్తున్న మాదిరిగా బిఆర్ఎస్ ప్రభుత్వమూ బోనస్ ఇవ్వాలని కోరారు. వీటి కోసం ప్రత్యేకంగా బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. రైతుల పండించే పంటలకు కనీస మద్దతుధర అమలు కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, పూర్తి సబ్సిడీతో విత్తనాలు, ఎరువులు అందించేందుకు బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బి ప్రసాద్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి శోభన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు క్షేత్రస్థాయి నుంచి బడ్జెట్ ప్రతిపాదనలు తీసుకోవాలని, అందుకు వ్యవసాయ రంగంలో పని చేస్తున్న సంఘాలు, సంస్థలు, రైతు సంఘాలు, రైతులతో సంప్రదింపులు జరపాలని సూచించారు. కౌలు, పోడు సాగుదారులకు రైతుబంధు, రైతు బీమా వర్తింపజేయాలని అన్నారు. వలసలు నివారించేలా వ్యవసాయ విధానాలు తీసుకురావాలని, పట్టణ పేదలకు ప్రత్యేకంగా పని కల్పించేందుకు కేరళ తరహాలో రూ.వెయ్యి కోట్లు 'పట్టణ ఉపాధి హామీ' కోసం కేటాయించాలన్నారు. వివిధ ప్రాజెక్టుల కోసం సేకరిస్తున్న భూసేకరణ ప్రాంతాలలో వ్యవసాయ కార్మికులు వత్తిదారులను ఆదుకొనేందుకు ప్రత్యేక ప్యాకేజీకి బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు తెల్లరేషన్ కార్డుదారులకు సబ్సిడీ బియ్యం అందించేందుకు రాష్ట్ర బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించాలని, 14 రకాల నిత్యావసర సరుకులు అందించే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బాధితులకు భూసేకరణ చట్టం 2013 ప్రకారం పునరావాసం కల్పించాలన్నారు. ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకున్న వారికి పట్టాలిచ్చి ఇంటి నిర్మాణానికి రూ. ఐదు లక్షలు ఇవ్వాలని కోరారు. కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి టి స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ కులాంతర వివాహాలు చేసుకున్న వారికి ఉపాధి కల్పించేందుకు బడ్జెట్లో ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని కోరారు అనంతరం తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ 2023-24పై రైతుల ఆకాంక్షల నివేదిక విడుదల చేశారు. కార్యక్రమానికి తెలంగాణా అగ్రి నెట్‌వర్క్, సిబిజిఎ రాష్ట్ర సమన్వయకర్త సురుపంగ శివలింగం అధ్యక్షత వహించారు. సిబిజిఎ ప్రతినిధి సోమశేఖర్, పిఎంసి నాయకులు శ్రీనివాసులు పాల్గొన్నారు.